

18 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 27: మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పదో తరగతి వార్షిక పరీక్షలు జరుగుతాయని డీఈవో యాదయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల కోసం జిల్లాలో 52 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థుల కోసం కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

మహిళా సంఘాలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, హెల్త్ ఎడ్యుకేటర్

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 27: మంచిర్యాల మున్సిపాలిటీ కార్యాలయంలోని మెప్మా సమావేశ మందిరంలో మంగళవారం మహిళా సంఘాల ఆఫీస్ బేరర్లకు జిల్లా ఉప వైద్యాధికారి కార్యాలయం సిబ్బంది అవగాహన కల్పించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామ్మూర్తి, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్‌లు బోధకాలు నిర్ధారణకు రక్తపూతల సేకరణ, ఆరోగ్య మహిళ క్లినిక్‌లు, టీ హబ్ సేవలను గురించి వివరించారు. గర్భిణీల నమోదు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులతో జరిగే మేలును వివరించి సమాచారాన్ని చేరవేయాలని సూచించారు. మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మెప్మా కో ఆర్డినేటర్ చంద్రయ్య, కమ్యూనిటీ ఆర్గనైజర్‌లు సరోజ, సుజాత, అరుణ, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పింఛన్‌లు సక్రమంగా పంపిణీ చేయాలి

జైపూర్, ఫిబ్రవరి 27: పింఛన్‌లను సక్రమంగా పంపిణీ చేయాలని ఎంపీడీవో జి.సత్యనారాయణ సూచించారు. మంగళవారం శెట్‌పల్లి గ్రామంలోని పంచాయతీ కార్యాలయం ఆవరణలో జరుగుతున్న పింఛన్‌ల పంపిణీని పరిశీలించారు. పింఛన్‌దారులకు పింఛన్‌లు అందజేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ పింఛన్‌ల పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా సక్రమంగా అందజేయాలని బీపీఎంకు సూచించారు. పింఛన్‌దారులకు ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

3న బాడీ బిల్డింగ్ పోటీలు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 27 :బెల్లంపల్లి పట్టణంలో మార్చి 3వ తేదీన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాడీ బిల్డింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు స్కై జిమ్ నిర్వాహకులు పన్నాల సదానందం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిస్టర్ ఐరన్ మ్యాన్ (ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా), మిస్టర్ బెల్లంపల్లి పోటీలను స్థానిక నెంబరు 2 గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సాహవంతులైన వారు పోటీల్లో పాల్గొనాలన్నారు. వివరాలకు 9059540130లో సంప్రదించాలన్నారు.

నేడు సంకటహర చతుర్థి

నస్పూర్, ఫిబ్రవరి 27: హౌసింగ్ బోర్డ్ కాలనీలోని లక్ష్మి గణపతి దేవాలయంలో సంకట హర చతుర్థిని పురస్కరించుకుని బుధవారం స్వామి వారికి చెరకు రసంతో అభిషేకం నిర్వహి స్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రఘుపతిరావు, ప్రధానార్చకులు వంశీకృష్ణవర్మలు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు లక్ష్మి గణపతి హోమం నిర్వహిస్తామన్నారు. పూజ కార్యక్రమాల అనంతరం పల్లకి సేవ అన్నదాన కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ రఘుపతి రావు తెలిపారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ



నస్పూర్‌లోని వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

నస్పూర్, ఫిబ్రవరి 27: మాదిగ హక్కుల దండోరా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీసీసీలోని సాయి వృద్ధాశ్రమంలో మంగళవారం నాయకులు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలను నిర్వహించారు. మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునిల్ మాదిగ మాట్లాడుతూ జాతికి రావాల్సిన హక్కుల సాధనకు పోరాటం చేస్తూ జాతి ఐక్యత కోసం కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలుకంటి జనార్దన్ మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుశ్నపల్లి నారాయణ, జిల్లా అధ్యక్షుడు కదారి రమేష్, పట్టణ అధ్యక్షుడు అట్కపురం సమ్మయ్య, నాయకులు కొప్పర్తి రాజం, కొండ్ర లింగయ్య, కొమురయ్య, పురుషోత్తం, కొండ్ర ఉదయ్, సంజీవ్, సాజన్, బాబన్న, చంద్రయ్య, వెంకటి పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

కోటపల్లి, ఫిబ్రవరి 27: మండలంలోని పారుపెల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం పాఠశాల పూర్వ హెచ్‌ఎం దుద్దిళ్ల శంకర్‌రావు విద్యార్థులకు బ్యాగులు, డ్రాయింగ్ కిట్‌లు, స్కిప్పింగ్ రోప్స్ పంపిణీ చేశారు. ఇన్ఫోసిస్ ఉద్యోగులు సాయికృష్ణ, ముత్యపు వంశీలు అందించగా ఉపాధ్యాయులు విద్యార్థులకు అందజేశారు. హెచ్‌ఎం వసంత కుమారి, ఉపాధ్యాయులు రవి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

కోటపల్లి, ఫిబ్రవరి 27: మండలంలోని రాంపూర్, దేవులవాడ, లక్ష్మీపూర్, వెల్మపల్లి, రాపన్‌పల్లి, అన్నారం గ్రామాల్లోని నర్సరీలను మంగళవారం ఎంపీడీవో ఆకుల భూమయ్య, ఎంపీవో అక్తర్ మొహియొద్దీన్‌లు పరిశీలించారు. నర్సరీలో మొక్కలు నాటడం, ఎదుగుదల తదితర అంశాలపై సూచనలు ఇచ్చారు. వేసవి దృష్ట్యా మొక్కల పెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అక్రమ పట్టా రద్దు చేసి న్యాయం చేయాలి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 27: అక్రమ పట్టాను రద్దు చేసి న్యాయం చేయాలని జాడి తిరుపతి మంగళవారం ఆర్డీవో హరికృష్ణకు వినతిపత్రం అందించాడు. బాధితుడు తిరుపతి మాట్లాడుతూ మండలంలోని ఆకెనపల్లి శివారులో తమ తాత దుర్గం లస్మయ్య పేరు మీద సర్వే నెంబరు 3లో 2.75 ఎకరాల భూమి ఉందన్నారు. తాత చనిపోయాక సోమగూడెం గ్రామానికి చెందిన ఒక ప్రజాప్రతినిధి దుర్గం లింగయ్య అనే వ్యక్తి మీద అక్రమ పట్టా చేయించాడని తెలిపాడు. అప్పుడున్న అధికారులు ప్రజాప్రతినిధికి సహకరించడంతో పట్టా మార్పిడి జరిగిందని ఆవేదన వ్యక్తంచేశాడు. ఈ విషయంపై ఐదేళ్లుగా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై విచారణ జరిపి అక్రమ పట్టాను రద్దు చేసి తన భూమి తనకు ఇప్పించాలని కోరాడు. తనకు న్యాయం చేయకుంటే ఆర్డీవో కార్యాలయం ఎదుట కుటుంబంతో ఆందోళన చేస్తానని తెలిపాడు.

సస్యరక్షణపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

కోటపల్లి, ఫిబ్రవరి 27: మండలంలోని బోరంపల్లిలో మంగళవారం వ్యవసాయాధికారి మహేందర్ రైతులకు సస్యరక్షణపై అవగాహన కల్పించారు. వరి పంట క్షేత్రాలను సందర్శించిన ఆయన కాండం తొలిచే పురుగు, పీక పురుగు నివారణ, పొట్ట దశలో వరి పైరుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రసాయనాలు అంశాలపై వివరించారు. ఏఈవో శేఖర్, రైతులు పాల్గొన్నారు.

ఆల్ ది బెస్ట్


నేటి నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు

నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

సమీపంలోని జిరాక్స్, నెట్ సెంటర్ల మూసివేత

పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, వైద్య సిబ్బంది



ఏసీసీ, ఫిబ్రవరి 27: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 25 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో పది ప్రభుత్వ జూనియర్ కళాశాలు, 9 ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో, 6 కేంద్రాలను మోడల్ జూనియర్ కళాశాలల్లో, కేజీ బీవీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఏర్పాటు చేశారు. ఇప్పటికే హాల్ టికెట్‌లను సంబంధిత కళాశాలల ద్వారా ఆన్‌లైన్‌లో బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్ నుంచి డౌన్ లోడ్‌ల ద్వారా విద్యార్థులకు అందాయి. ఇంటర్ మొదటి సంవత్సరానికి జిల్లాలో 8394 మంది, ఇంటర్ ద్వితీయ సంవత్సరా నికి 7135 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. బుధవారం నుంచి మార్చి 18 వరకు ఇంటర్ మొదటి సంవత్సరం, ఈ నెల 29 నుంచి మార్చి 19 వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరగనున్నాయి. రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. అరగంట ముందుగానే పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తారు. 9 గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరని ఇంటర్ బోర్డు అధికారులు ఆదేశించారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. కేంద్రాల సమీపంలోని జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను మూసి ఉంచాలని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాని కి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్టుమెంటల్ ఆఫీసర్ వంతున 25 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 25 మంది డిపార్టుమెంటల్ ఆఫీసర్లను నియ మించారు. సమీప పోలీస్‌స్టేషన్‌లలో ప్రశ్న పత్రాలను భద్రపరిచేందుకు కస్టోడి యన్‌లను నియమించారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను సీనియర్ లెక్చరర్, ఏఎస్‌ఐ, డిప్యూటీ తహసీల్దార్ సభ్యులుగా ఏర్పాటు చేశారు. జిల్లాలో సున్నితమైన పరీక్ష కేంద్రంగా కాసిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గుర్తించారు. సున్నితమైన పరీక్ష కేంద్రాలుగా గుర్తించిన కేంద్రాల్లో ముగ్గురు సభ్యుల సిట్టింగ్ స్క్వాడ్ టీం నియామ పెట్టనుంది. డీఐఈవో కన్వీనర్‌గా సీనియర్ ప్రిన్సిపాల్, సీనియర్ లెక్చరర్ సభ్యులుగా డిస్ట్రిక్ ఎగ్జామినేషన్ కమిటీ ఆధ్వర్యంలో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించనున్నారు.

పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి...

పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీటి వసతి, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మందులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంటారు. పరీక్ష కేంద్రాల్లో లైటింగ్, ఫ్యాన్‌లు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. విద్యార్థులు బ్లూ, బ్లాక్, బాల్ పెన్, మ్యాథమ్యాటిక్స్ పరీక్ష రోజు కంపాక్స్‌బాక్స్, సైన్స్ పరీక్ష రోజు డ్రాయింగ్ పరికరాలు తీసుకువెళ్లేందుకు అనుమతి ఇస్తారు. చేతి గడియారాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రంలోకి అనుమతించరు.



హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది



బోర్డుపై సీటింగ్ అరెంజ్‌మెంట్ వేస్తున్న సిబ్బంది

పకడ్బందీగా నిర్వహణ

శైలజ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి



ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించనున్నాం. అధికారుల కేటాయింపు, కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తిచేశాం. హాల్ టికెట్లలో ఏమైనా తప్పులున్నా, ఫొటో, సంతకం సరిగ్గా లేకపోయినా డిస్ట్రిక్ ఎగ్జామినేషన్ కమిటీని సంప్రదించాలి. సంబం ధిత కళాశాల సిబ్బంది ద్వారా నామినల్ రోల్స్‌ను వెరిఫై చేసి సరి చేయడం జరుగుతుంది. సరి చేసిన హాల్ టికెట్ ద్వారా విద్యార్థులు పరీక్షకు హాజరు కావచ్చు. పరీక్షల కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశాం.

దండేపల్లి: దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్షల చీఫ్ సూపరిండెంట్ బి శోభ, డిపార్టుమెంటల్ అధికారి బాపురావులు తెలిపారు. మంగళవారం ప్రభుత్వ కళాశాలలోని పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్ నెంబర్లను వేయించారు.

త్యాగాలకు మారుపేరు సంత్ సేవాలాల్ మహారాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 27 : త్యాగాలకు మారుపేరు సంత్ సేవాలాల్ మహారాజ్ అని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. మంగళవారం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని జిల్లా కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్స్ సమీపంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్, అదనపు కలెక్టర్ మోతిలాల్‌లు హాజరై బంజారా సంప్రదాయాల ప్రకారం ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ అని పేర్కొన్నారు. సేవాలాల్ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం అనేక ఉద్యమాలు చేశారని తెలిపారు. ప్రజల మూఢ విశ్వాసమైన జంతుబలిని వ్యతిరేకించారని పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ అడుగు జాడల్లో ప్రతీ ఒక్కరు నడవాలని సూచించారు. జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి గంగారాం, అధికారులు, బంజారా సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకర్, ప్రకాష్ నాయక్, రఘునాద్ చౌహాన్, ఇందల్ నాయక్, రాజునాయక్, మల్లేష్, పరశురాం, ప్రేం సింగ్, ప్రకాష్‌సకలాల్, నీలయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోటపల్లి, ఫిబ్రవరి 27: విద్యుత్ సరఫరాలో బుధవారం అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కిష్టంపేట నుంచి కోటపల్లి వెళ్లే 33కేవీ లైన్ మరమ్మతు కారణంగా కోటపల్లి, ఆల్గామ, దేవులవాడ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామా ల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వేమనపల్లి: మరమ్మతు కారణంగా బుధవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ దీక్షిత్ ఒక ప్రకటనలో తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

వేమనపల్లి, ఫిబ్రవరి 27: వేమనపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను మంగళవారం నీల్వాయి ఎంపీటీసీ సం తోష్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సీడీ ఎఫ్ నిధులతో రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ ఆలీ, మాజీ సర్పంచులు మధు, రామచంద్రం, నాయకులు శేఖర్, సమ్మయ్య, నాగేష్, రమేష్, సంతోష్, చందు, మధు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైట్లు వెలిగేలా చూడాలి

జైపూర్, ఫిబ్రవరి 27 : ఇందారం బస్టాండ్ నుంచి ఫ్లైఓవర్ వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైట్లు వెలిగేలా చూడాలని హెచ్‌కేఆర్ ప్రతినిధి రామకృష్ణకు మంగళవారం అరికె స్వర్ణసంతోష్ వినతి పత్రం అందించారు. మాజీ మంత్రి హరీష్‌రావు ప్రారంభించారని నేటికి లైట్లు వెలగడం లేదన్నారు. లైట్లు లేక ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నాయకులు సంతోష్ యాదవ్, రాజబాబు పాల్గొన్నారు.

అభివృద్ధి సాధనలో ఆర్థిక అక్షరాస్యత ఎంతో ముఖ్యం



2కే రన్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 27: ఆర్థికాభివృద్ధి సాధనలో ఆర్థిక అక్షరాస్యత ఎంతో ముఖ్యమని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తా నుంచి ఐబీ చౌరస్తా వరకు చేపట్టిన 2కే రన్ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ మోతిలాల్, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ తిరుపతితో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధి సాధనలో ఆర్థిక అక్షరాస్యత ఎంతో ముఖ్యమన్నారు. ఒక నిర్దిష్ట సొమ్మును పొదుపు చేసిన తర్వాత మిగితా సొమ్మును ఖర్చులకు వినియోగించినట్లయితే ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్ మోసాలకు పాల్పడే వారి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని, బ్యాంకుఖాతా, డెబిట్, క్రెడిట్ కార్డులు, బ్యాంకు సంబంధిత సమాచారాన్ని చెప్పవద్దన్నారు. బహిరంగ ప్రదేశాల్లో వైఫైని ఉపయోగించి బ్యాంకు లావాదేవీలు చేయవద్దన్నారు. డిజిటల్ సేవలు సౌకర్యవంతంగా, సురక్షితంగా ఉంటాయని, వినియోగించే సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. బ్యాంకులో వ్యక్తిగత, విద్య, గృహ నిర్మాణానికి, వ్యవసాయం, వాహనాల కొనుగోలుతో పాటు వ్యాపార అభివృద్ధి రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. బ్యాంకుల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌పై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి అర్పితరెడ్డి

ఏసీసీ, ఫిబ్రవరి 27: జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ ఆధ్వర్యంలో మార్చి 9న నిర్వహించనున్న లోక్ అదాలత్‌పై మంగళవారం జిల్లా కోర్టు హాలులో అదనపు సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవా సాధికార సంస్థ కార్యదర్శి అర్పితరెడ్డి సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్‌తో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని సూచించారు. ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి సంపత్‌కుమార్, అదనపు జూనియర్ సివిల్ జడ్జీలు ఉపనిషద్వాని, నిరోషా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పులి రాజమల్లు, సురేందర్ ఉపాధ్యాయ, పట్టణ సీఐ రవీందర్, రూరల్ సీఐ అశోక్, మహిళ పోలీస్‌స్టేషన్ సీఐ ప్రవీణ్‌కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

సజావుగా టెక్నికల్ సర్టిఫికెట్ పరీక్ష

ఏసీసీ, ఫిబ్రవరి 27: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్ష జిల్లా కేంద్రంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో మంగళవారం సజావుగా జరిగింది. డ్రాయింగ్ లోయర్, హయ్యర్ , టైలరింగ్ హయ్యర్ పరీక్షకు ఉదయం 384 మందికి 283 మంది, మధ్యాహ్నం 343 మందికి 244 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలి



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య

చెన్నూరు, ఫిబ్రవరి 27: విద్యార్థులు పరీక్షలంటే భయపడవద్దని, ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య తెలిపారు. మంగళవారం మైనార్టీ ఫంక్షన్ హాలులో చెన్నూరు, కోటపల్లి మండలాల ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతీ మండలంలో పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పక్కా ప్రణాళితో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. మున్సిపల్ కమిషనర్ గంగాధర్, ఎంపీడీవో మోహన్, కోఆర్డినేటర్ చౌదరి, ఎంఈవో రాధాకృష్ణమూర్తి, ఎంపీవో అజ్మత్ అలీ, సబ్జెక్టుల నిపుణులు, ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

జైపూర్: విద్యార్థులు కష్టపడి కాదు ఇష్టపడి చదవాలని డీఈవో యాదయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జైపూర్, భీమారం మండలాల పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. పరీక్షలంటే భయం వద్దని, ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస నిపుణులతో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ బాలభాస్కర్, డీసీఈబీ సెక్రెటరీ భీంరావు, సెక్టోరల్ అధికారి చౌదరి, ఎంపీవో అనిల్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు దత్తు కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాండూర్: విద్యార్థులు ప్రణాళికబద్దంగా చదువుకోవాలని జిల్లా సెక్టోరల్ అధికారి మూర్తి, ఎంపీడీవో శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు ఐబీ కేంద్రంలోని సురభి ఫంక్షన్‌హాలులో పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంతో చదువుకోవాలన్నారు. మండల నోడల్ అధికారి మల్లేశం, ఎంపీవో సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, జయప్రకాష్, ప్రదీప్, కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్‌వో సుమన, సీఆర్‌పీ తిరుపతి పాల్గొన్నారు.

పదిలో మంచి ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జీఎం మనోహర్

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 27: పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని జీఎం మనోహర్ తెలిపారు. మంగళవారం సింగరేణి పాఠశాల వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జీఎం మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం కార్మిక, కార్మికేతర పిల్లల విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. కార్మికుల పిల్లలు మంచి విద్యను అభ్యసిస్తే ఉన్నత స్థాయికి చేరుకుంటారని తెలిపారు. పాఠశాల కరస్పాం డెంట్ శ్యాంసుందర్ మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం విద్యా ర్థులకు మంచి సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్ రెడ్డి, సేవా సమితి అధ్యక్షురాలు సవితమనోహర్ పాల్గొన్నారు.

స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలి

ఏసీసీ, ఫిబ్రవరి 27: మంచిర్యాల పట్టణంలోని 19వ వార్డులో రైల్వే ట్రాక్ పక్కన స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు తుల మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో కాల నీవాసులు మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్యలకు మంగళవారం వినతి పత్రం అందించారు. రైల్వే ట్రాక్ వెంట స్ట్రీట్ లైట్లు లేకపోవడంతో రాత్రి వేళలో కొంత మంది అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. గూడ రవీందర్, ఒడ్నాల సత్యనారాయణ, రాచకొండ సత్యనారాయణ,రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

దహెగాం/కౌటాల/బెజ్జూరు/వాంకిడి/జైనూర్, ఫిబ్రవరి 27: జిల్లాలోని పలు మండలాల్లో ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దహెగాం మంల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళావాలలో ఈ నెల 28నుంచి నిర్వహించనున్న ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సీఎస్ అమరేందర్ తెలిపారు. కౌటాల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 735 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. బెజ్జూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ జ్ఞానేశ్వర్ తెలిపారు. వాంకిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ సంపత్‌కుమార్ తెలిపారు. జైనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలకు ఏర్పాటు చేశామని ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. ఇంటర్మీడీయట్ ప్రథమ సంవత్సరంలో 365మంది, ద్వితీయ సంవత్సరంలో 354 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన సీఐ నాగరాజు, ఎస్సై కొమురయ్య

పెంచికలపేట, ఫిబ్రవరి 27: పెంచికలపేట మండలంలోని గుండెపల్లి గ్రామానికి చెందిన తలండి నిర్మల అనే యువతి హత్య కేసులో నిందితుడిని మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు సీఐ నాగరాజు, ఎస్సై కొమురయ్య వివరాలు వెల్లడించారు. చింతలమానేపల్లి మండలం కోయపల్లి గ్రామానికి చెందిన కుమరం రవికుమార్ నిర్మలతో ఏడాది కాలంగా ప్రేమలో ఉన్నాడు. శుక్రవారం సాయంత్రం రవికుమార్ గుండెపల్లి గ్రామానికి రాగా తలండి నిర్మల ఫోన్‌లో మాట్లాడుతుండడం గమనించాడు. ఫోన్ ఎవరితో మాట్లాడుతున్నావని అనుమానంతో గొడవకు దిగాడు. మాట మాట పెరగడంతో దగ్గరలో ఉన్న కర్రను తీసుకొని ఆమెపై దాడి చేశాడు. దాడితో స్పృహ తప్పిన ఆమెను దగ్గరలో ఉన్న వ్యవసాయ బావిలోకు తోసి వెళ్లి పోయాడు. రెండు రోజులుగా యువతి కనిపించక పోవడంతో కుటుంబీకులు ఆచూకీ కోసం వెతుకుతున్నారు. ఈ క్రమంలో వ్యవసాయ బావి సమపంలో రక్తపు మరకులు, నిర్మల చెప్పులు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. తండ్రి నారాయణ ఫిర్యాదుతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి కేసు నమోదు చేశారు. కుటుంబీకుల ఫిర్యాదుతో హత్య చేసింది కుమరం రవికుమార్ అని నిర్ధారించుకొని మంగళవారం మధ్యాహ్నం ఎల్కపల్లి సమీపంలో నిందితుడిని అదుపులో తీసుకున్నారు. విచారణలో నిర్మలను అనుమానంతో హత్య చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. నిందితుడు నుంచి ఒక సెల్‌ఫోన్ దాడికి ఉపయోగించిన కర్రను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు సీఐ నాగరాజు తెలిపారు.

రెండు ఆర్టీసీ బస్సులు ఢీ : పలువురికి గాయాలు

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 27: ఆసిఫాబాద్ మండలంలోని బూర్గుడ సమీపంలో మంగళవారం రెండు ఆర్టీసీ బస్సులు ఢీ కొన్న ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. మంచిర్యాల నుంచి ఆసిఫాబాద్ వస్తున్న ఆర్టీసీ బస్సు బూర్గుడ సమీపంలో నిలిపి ఉంది. మంచిర్యాల నుంచి వస్తున్న మరో ఆర్టీసీ బస్సు బ్రేకులు పని చేయక పోవడంతో అగి ఉన్న బస్సును వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో వెనుక బస్సులో ఉన్న పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయాల పాలైన ప్రయాణికులను 108లో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ హనీ చోటు చేసుకోక పోవడంతో ఆర్టీసీ అధికారులు ఊపిరి పిల్చుకున్నారు.























ఎల్‌ఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ మాట తప్పింది

- ఫీజు లేకుండా క్రమబద్ధీకరించాలి
- తాగునీటిలోనూ లాభం వెతుకుతారా?
- ఇలాంటి వ్యక్తి సీఎం కావడం దురదృష్టకరం
- ప్రభుత్వమంటే రియల్ వ్యాపారం కాదు: హరీశ్



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే ఎల్‌ఆర్ఎస్‌ను రద్దు చేస్తామని, ఉచితంగా స్థలాలను క్రమబద్ధీకరిస్తాం అంటూ ప్రజలను రెచ్చగొట్టిన కాంగ్రెస్.. ఇపుడు మాట తప్పి ఫీజు వసూలు చేసేందుకు సిద్ధమైందని మాజీ మంత్రి టి.హరీశ్ రావు ఆరోపించారు. ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఎల్‌ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని, లేదంటే మోసపూరిత హామీ ఇచ్చినందుకు ప్రజలకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని.. ఇది వారి మోసపూరిత విధానాలకు నిదర్శనమని విమర్శించారు. ఆ పార్టీ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. గతంలో చేసిన ప్రకటనలకు అనుగుణంగా ఎల్‌ఆర్ఎస్‌ను ఎలాంటి ఫీజులు లేకుండా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు..ప్రజలకు అందించే స్వచ్ఛమైన తాగునీటిలోనూ లాభం వెతుకుతారా..? మిషన్ భగీరథ పథకంలో లాభం వెతికే వ్యక్తి ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టమని హరీశ్‌రావు పేర్కొన్నారు. భగీరథ ద్వారా ఏం లాభం తెచ్చారని.. దానికోసం తెచ్చిన అప్పుపై వడ్డీ ఎలా కడతారని ఆయన ప్రశ్నించడం అంతకన్నా దౌర్భాగ్యం, భావదారిద్ర్య ఆరోపణ మరొకటి ఉండద మంగళవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వమంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు.. ప్రజా సంక్షేమంలో లాభనష్టాలు చూసుకోరని రేవంత్‌రెడ్డిపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. మిషన్ భగీరథ పథకాన్ని ప్రజల ఆరోగ్యం కాపాడిన గొప్ప సంజీవనిగా చూడాలని.. అందులో లాభనష్టాలు బేరీజు వేసుకోవడం ఒక ప్రభుత్వాధినేతకు తగదని హితవుపలికారు. ఆసరా పెన్షన్ల ద్వారా కూడా రూ.వేలకోట్లు ఖర్చవుతుంది. దాని వల్ల కూడా లాభం లేదంటారా..? అని ప్రశ్నించారు.

మీ ఎత్తు గురించి నేను మాట్లాడితే..!

'ఇటీవల పలు సందర్భాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిసారి నా ఎత్తు గురించి వ్యాఖ్యానిస్తున్నారు. నేను కూడా మీ (సీఎం రేవంత్‌ను ఉద్దేశించి) ఎత్తు గురించి మాట్లాడితే సంస్కారవంతంగా ఉండదు. ఎవరి ఎత్తు ఎంత అనేది ప్రజలకు అవసరం లేదు. ప్రజల కోసం ఎవరు ఎంతమేరకు ఆలోచిస్తున్నారో.. ఎవరెంత పనిచేస్తున్నారో.. మాత్రమే వారికి అవసరం' అని హరీశ్‌రావు వెల్లడించారు.

కాంగ్రెస్ వస్తే ఎల్‌ఆర్ఎస్ రద్దు చేస్తామన్నారు కదా?: టీఆర్ఏ

ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్న ముఖ్యమంత్రితోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్‌ఆర్ఎస్ రద్దు చేస్తామని ప్రకటనలు చేశారని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ (టీఆర్ఏ) అధ్యక్షుడు నారగోని ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు. "గత ప్రభుత్వం ఎల్‌ఆర్ఎస్ కింద రుసుము వసూలుకు ప్రతిపాదనలు చేస్తే.. లేఅవుట్ రెగ్యులేషన్ స్కీమ్ లాగే మ్యారేజ్ రెగ్యులేషన్ స్కీమ్ కూడా తీసుకొస్తారేమో అని గతంలో రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇప్పుడేమో సీఎం హోదాలో అదే పథకాన్ని అమలు చేసేందుకు రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఎల్‌ఆర్ఎస్ రద్దు చేయాలని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేయగా గతంలో కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. ఇప్పుడు ఇదే ప్రభుత్వం ఎల్‌ఆర్ఎస్ తెరమీదకు తెచ్చి మార్చి 31లోగా గడువు విధించి రెగ్యులరైజేషన్ చేయించుకోవాలని చెప్పడం సమంజసంగా లేదు" అని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తెలంగాణలో 17 సీట్లూ బీజేపీ గెలవాలి

హైదరాబాద్ సీటును కూడా కైవసం చేసుకోవాలి.. అసదుద్దీన్ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవాలి

- విజయ సంకల్ప యాత్రలో కిషన్‌రెడ్డి



విజయ సంకల్ప యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

హైదరాబాద్ సిటీ/కార్వాన్/నిజామాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాల్లోనూ బీజేపీ గెలవాలని, మజ్లిస్ సీటును కూడా కైవసం చేసుకుని అసదుద్దీన్ ఒవైసీ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాసామ్యానికి, అభివృద్ధికి వ్యతిరేకంగా మజ్లిస్ పార్టీ పనిచేస్తుందని, మెట్రో రైలు ప్రాజెక్టును అడ్డుకుంటుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే దాని పంచన చేరి పోలీసు వ్యవస్థను తన ఆధీనంలో పెట్టుకుంటుందని విమర్శించారు. మంగళవారం కిషన్ రెడ్డి హైదరాబాద్‌లో రెండో రోజు విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. గుడిమల్కాపూర్ జైన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్వాన్, గోషామహల్, చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో యాత్ర కొనసాగింది. జుమ్మేరాత్ బజార్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. బీజేపీకి ముఖ్యంగా హైదరాబాద్ లోక్‌సభ సీటు గెలవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలో 12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని, మోదీ ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా పాలన కొనసాగిస్తున్నార న్నారు. ప్రపంచంలో భారతదేశ ప్రతిష్ఠను పెంచారన్నారు. రాష్ట్రంలో 17 లోక్‌సభ, 114 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 5500 కిలోమీటర్ల మేర ఐదు విజయ సంకల్ప యాత్రలు కొనసాగుతాయని తెలిపారు. వచ్చే నెల 2వ తేదీతో ముగుస్తాయన్నారు. మోదీ మళ్లీ ప్రధాని కావాలని ఈ యాత్రలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కాగా, నిజామాబాద్ జిల్లా బాల్కొండ, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ నియోజకవర్గాల్లో జరిగిన యాత్రలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పాల్గొన్నారు. కేంద్రంలో మూడోసారి బీజేపీయే అధికారంలోకి వస్తుందని, మోదీ మళ్లీ ప్రధాని అవుతారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మోదీ రైతుల కోసం పసుపు బోర్డు ఏర్పాటు చేసి హామీ నెరవేర్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ నామమాత్ర మెజారిటీతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పటికీ ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్‌కు ఆదరణ లేదని, కేంద్రంలో ఆ పార్టీ అధికారంలోకి రావడం కలేనని వ్యాఖ్యానించారు.

తల్లిని అడ్డు పెట్టుకొని రాజకీయాలు

పొన్నం తల్లిని నేను అవమానించలేదు.. యాత్రను ఆపేయాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టం

- హామీల అమలును ప్రశ్నిస్తే దాడులా?
- నేను ఓడిపోతే.. రాజకీయ సన్యాసం
- కాంగ్రెస్ ఓడితే పొన్నం తప్పుకుంటారా?
- కేటీఆర్‌తో బీఆర్ఎస్..

పొన్నంతో కాంగ్రెస్ నాశనం: సంజయ్

హుస్నాబాద్, ఫిబ్రవరి 27: కన్న తల్లిని అడ్డుపెట్టుకొని మంత్రి పొన్నం ప్రభాకర్ రాజకీయం చేయాలనుకుంటున్నాడని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. 'రాముడు అయోధ్యలోనే పుట్టాడా..?' అని అడిగిన వారిని ప్రశ్నించాను తప్ప.. పొన్నం తల్లిని ఉద్దేశించి అనలేదని వివరణ ఇచ్చారు. అందరు తల్లులు తన తల్లితో సమానమని.. ప్రభాకర్ తల్లిని తాను అవమానించలేదని స్పష్టం చేశారు. తాను అంత సంస్కారహీనుడిని కారని అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చేలోగా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే.. అడుగడుగునా నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. హామీల అమలుకు ఇంకా 20 రోజులే గడువు ఉందన్నారు. రేషన్ కార్డులు ఉన్న వారికే పథకాలు ఇస్తామని చెబుతున్నారని.. రేషన్ కార్డులు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. తాను హామీల అమలును ప్రశ్నిస్తే.. కాంగ్రెస్ దాడులు చేయించడం ఏంటని ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్ ఏమీ చేయలేదు కాబట్టే గత ఎంపీ ఎన్నికల్లో మూడో స్థానం వచ్చిందని తెలిపారు. అయోధ్య అక్షింతలను రేషన్ బియ్యం అని ఆయన అన్నది వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. ప్రజాహిత యాత్రను ఆపాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టమని హెచ్చరించారు. కేసీఆర్ పదేళ్లలో రూ.5 లక్షల కోట్ల అప్పు చేస్తే, కాంగ్రెస్ 2 నెలల్లో రూ.10వేల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. తల్లిని అడ్డం పెట్టుకుని



ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్

రాజకీయాలు చేస్తున్నందుకు స్వర్గంలో ఉన్న పొన్నం తల్లి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని సంజయ్ అన్నారు. అయితే, పక్కనే ఉన్న నాయకులు పొన్నం తల్లి బతికే ఉందని.. తండ్రి చనిపోయాడని తెలిపారు. దీంతో పొరపాటును గుర్తించిన సంజయ్.. పొన్నం తండ్రి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని అన్నారు. ఆయన తల్లి నూరేళ్లు ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. 'రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రికి సవాల్ విసురుతున్నా.. నేను నా విశ్వాసాలతో రాముడి పేరిట ఎంపీ ఎన్నికల్లో నిలుచుంటా. నువ్వు నీ వాదనతో అభ్యర్థిని నిలబెట్టు. నేను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా. మళ్లీ రాముడని, హిందూ మతమని మాట్లాడను. మీ అభ్యర్థి ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటావా..?' అని బండి సంజయ్ పేర్కొన్నారు. కేటీఆర్‌తో బీఆర్ఎస్ నాశనమైందని, పొన్నం లాంటి వారితో కాంగ్రెస్ నాశనమవుతుందని పేర్కొన్నారు. 'కేంద్ర ప్రభుత్వం ఉచితంగా రేషన్ బియ్యం ఇస్తుంటే మీ ఫొటోలు పెట్టుకుంటారా.. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా బియ్యం ఇస్తోందని, ఇక్కడికి బియ్యం పంపవద్దని ప్రధాని మోదీకి లేఖ రాస్తా' అని అన్నారు.

సంజయ్ క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్ శ్రేణుల డిమాండ్

పాదయాత్ర శిబిరాన్ని ముట్టడించే యత్నం

చిగురుమామిడి/హుస్నాబాద్ రూరల్: సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్ర మంగళవారం ఉద్రిక్త వాతావరణంలో సాగింది. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని హుస్నాబాద్ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. సంజయ్ ప్రజాహిత యాత్రను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో సోమవారం రాత్రి సంజయ్ బస చేశారు. మంగళవారం ఉదయం అక్కడికి తరలి వచ్చిన కాంగ్రెస్ నాయకులు సంజయ్ బస చేసిన శిబిరాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. అక్కడ ఉన్న బీజేపీ నాయకులు వారిని ప్రతిఘటించారు. పోలీసులు ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. దీంతో ఉల్లంపల్లి శివారులోని ప్రధాన రహదారిపై కాంగ్రెస్ కార్యకర్తలు బైఠాయించారు. కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కరీంనగర్ జిల్లా సరిహద్దు నుంచి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని రాములపల్లి వరకు పాదయాత్రను పోలీస్ బందో బస్తుతో తీసుకెళ్లారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. కరీంనగర్‌లో రాస్తారోకో చేశారు. పలుచోట్ల సంజయ్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎంపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాహిత యాత్ర మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలానికి వస్తున్న క్రమంలో సంజయ్‌కి స్వాగతం పలుకుతూ బీజేపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై కాంగ్రెస్ కార్యకర్తలు అనుచిత రాతలు రాశారు. దీనిపై బీజేపీ నేతలు ముల్కనూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యాత్ర పేరిట 'బండి' రాజకీయ డ్రామాలు

- నా తల్లిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు
- ఎంపీగా అయిదేళ్లలో ఏం చేశారో చెప్పాలి
- సంజయ్ ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడు : మంత్రి పొన్నం



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి)/హుస్నాబాద్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ రాజకీయ డ్రామాలతో ప్రజాహిత యాత్ర చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన గాంధీ భవన్‌లో, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తన తల్లిపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఎంపీగా ఐదేళ్ల పదవీ కాలంలో సంజయ్ కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నిస్తే.. ఆయన తన తల్లి జన్మకు సంబంధించి వ్యాఖ్యలు చేశారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేవలం ప్రచారం కోసమే సంజయ్ తన యాత్రను కాంగ్రెస్ అడ్డుకున్నట్లు డ్రామాలకు తెరలేపారన్నారు. తాము వాళ్ల యాత్రలు అడ్డుకోవడం లేదని, ప్రజాస్వామ్యంలో యాత్ర చేసే హక్కు అందరికీ ఉంటుందని, కానీ అవివేకమైన మాటలు సరికాదని విమర్శించారు. తనకు శ్రీరాముడు అంటే గౌరవం అని, ఏనాడు శ్రీరాముడి గురించి కాని, అక్షింతల గురించి గాని మాట్లాడలేదని, ఒకవేళ మాట్లాడినట్లు నిరూపిస్తే సజీవ సమాధికి సిద్ధమని సవాల్ విసిరారు. తన మాటలను వక్రీకరించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. శ్రీరాముని పేరు మీద ఓట్లు అడగడం కాదు.. అయిదేళ్ల కాలంలో కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ నియోజకవర్గ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సంజయ్ వ్యాఖ్యలపై బీజేపీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలు ఆలోచించాలన్నారు. ఇలాంటి నాయకుని డ్రామాలను సమర్థిస్తున్నారా..? అని ప్రశ్నించారు. సంజయ్ ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని మంత్రి హెచ్చరించారు.


కాలువల మరమ్మతు చేపట్టాలని నిరసన



రాళ్లవాగు ప్రాజెక్టు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

కాసిపేట, ఫిబ్రవరి 27: రాళ్లవాగు ప్రాజెక్టు కుడి కాలువ మరమ్మతు పనులను చేయించాలని మంగళవారం మల్కేపల్లి రైతులు ప్రాజెక్టు వద్ద నిరసన చేపట్టారు. రైతు సంఘం నాయకులు సూరినేని కమలాకర్‌రావు మాట్లాడుతూ రూ. 5 కోట్లతో రాళ్లవాగు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారని, కాలువల నిర్మాణంలో నిర్లక్ష్యం వ్యవహరించడంతో నీరు వృధాగా పోతుందన్నారు. దీంతో పంటలకు నీరందక యేటా పంటలు నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కుడి కాలువకు మరమ్మతు చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. 200 ఎకరాలకు అందించే నీరు నిల్వ ఉన్నప్పటికీ కాలువ సరిగ్గా లేకపోవడంతో వంద ఎకరాలకు సరిగ్గా నీరందే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా రాళ్లవాగు కుడి కాలువకు మరమ్మతు చేయించి రైతులను ఆదుకోవాలని కోరారు. రామారావు, రాములు, మల్లయ్య, లచ్చన్న, మల్లేష్, శంకరయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీదే విజయం



సిమెంటు రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపీ

జన్నారం, ఫిబ్రవరి 27 : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 375 స్థానాలు సాధిస్తుందని, మూడోసారి నరేంద్రమోదీ ప్రధాని అవుతారని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు పేర్కొన్నారు. మంగళవారం జన్నారం, బాదంపల్లి, ధర్మారం, చింతగూడ గ్రామాల్లో ఈజీఎస్ నిధులతో చేపట్టిన సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం సర్పంచులకు నిధులు మంజూరు చేయకపోవడంతో గ్రామాలు అనుకున్న స్థాయిలో అభివృద్ధి చెందలేదన్నారు.ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 80 రోజులు గడుస్తున్నా పంచాయతీలకు నిధులు మంజూరు చేయడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో ఎక్కడా కూడా ప్రధాని ఫొటోను రాష్ట్ర ప్రభుత్వం పెట్టకపోవడం బాధాకరమన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ యాత్రను కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడం సరైంది కాదన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు గోలి చందు, నాయకులు ప్రవీణ్,మధుసూదన్‌రావు, చిరంజీవి,మల్లేష్ పాల్గొన్నారు.

సమ్మక్క సారలమ్మ జాతర హుండీల లెక్కింపు



మందమర్రిటౌన్, ఫిబ్రవరి 27: పట్టణంలోని పాలవాగు ఒడ్డున నిర్వహించిన సమ్మక్క సారలమ్మ జాతర హుండీలను మంగళవారం పట్టణంలోని ఎల్లందు క్లబ్‌లో లెక్కించారు. రూ. 13.61 లక్షల ఆదాయం వచ్చింది. ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి,పీఎం శ్యాంసుందర్‌ల పర్యవేక్షణలో జరి గింది.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలకు మరమ్మతులు

- వాస్తు పేరిట బెల్లంపల్లి, చెన్నూర్‌లో కొనసాగుతున్న పనులు



బెల్లంపల్లిలో క్యాంపు కార్యాలయం గేటుకు మరమ్మతు



క్యాంపు కార్యాలయంలోని దర్వాజ తొలగింపు, చెన్నూరులో మరమ్మతుకు సిద్ధంగా ఉన్న సామగ్రి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 27: బెల్లంపల్లి, చెన్నూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలకు మరమ్మతు పనులు జరుగుతున్నాయి. వాస్తు పేరిట మరమ్మతు చేపడుతున్నారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా బెల్లంపల్లి ఏఎంసీ క్రీడా మైదానం ఎదుట దాదాపు కోటి రూపాయలతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని నిర్మించారు. ప్రజలు ఏ అవసరానికైనా ఎమ్మెల్యేను కలిసేందుకు వచ్చేవారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున విజయం సాధించి డిసెంబరు 3న ఎమ్మెల్యేగా గడ్డం వినోద్ ప్రమాణ స్వీకారం చేశారు. రెండు నెలలు గడుస్తున్నా క్యాంపు కార్యాలయం ప్రారంభించకపోవడంతో నియోజకవర్గంలోని ప్రజలు, అధికారులు, నాయకులు ఇబ్బందులు పడుతున్నారు.

క్యాంపు కార్యాలయానికి వాస్తు దోషం ఉందని, మరమ్మతు చేపట్టాలని ఎమ్మెల్యే వినోద్‌కు పురోహితులు సూచించినట్లు తెలిసింది. ఉత్తరం దిక్కున ఉన్న దర్వాజను తీసివేసి తూర్పునకు, గదులను వాస్తు ప్రకారం నిర్మించుకోవాలని సూచించడంతో ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. క్యాంపు కార్యాలయం ఎదుట గేటు, కాంపౌండ్ వాల్‌ను తొలగించారు. క్యాంపు కార్యాలయంలోని మొదటి గది దర్వాజను తీసివేసి గోడను నిర్మిస్తున్నారు. తూర్పు దిక్కున దర్వాజను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం రడగంబాల బస్తీలో ఓ ఇంటిని ఎమ్మెల్యే అద్దెకు తీసుకుని క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించగా ప్రజలకు దూరంగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. వాస్తు పేరుతో లక్షల రూపాయల ప్రజాధనం వృథా చేస్తుండడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చెన్నూరు: చెన్నూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వాస్తు దోషం ఉందంటూ మరమ్మతు చేపడుతున్నారు. చెన్నూరులో ఐదేళ్ల క్రితం క్యాంపు కార్యాలయం పూర్తికాగా బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన బాల్క సుమన్ కార్యాలయాన్ని వినియోగించుకున్నారు. ప్రజల సమస్యలతోపాటు అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించేవారు. కార్యకర్తలతో నిత్యం కార్యాలయం సందడిగా ఉండేది. రెండు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి వివేక్ వెంకటస్వామి గెలుపొందడంతో సుమన్ కార్యాలయాన్ని ఖాళీ చేశారు. అప్పటి నుంచి కార్యాలయానికి తాళం వేసి ఉండడంతో బోసిపోయి ఉంటుంది. కార్యాలయంలో పలు మార్పులు చేయాలని, వాస్తుకు అనుకూలంగా మలుచుకున్న తర్వాతనే ఎమ్మెల్యే అడుగు పెట్టనున్నట్లు సమాచా రం. ఎమ్మెల్యే మంచిర్యాలలోని ఆయన నివాసంలోనే నియోజకవర్గ నాయకులకు అందుబాటులో ఉంటున్నారని, సామాన్య ప్రజలకు ఎమ్మెల్యే కలువడం లేదని విమర్శలు ఉన్నాయి. ఏది ఏమైనా కోట్ల రూపాయల నిధులతో నిర్మించిన క్యాంపు కార్యాలయం వాస్తు దోషం పేరుతో బోసి పోతోంది.

ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రారంభం

నెన్నెల, ఫిబ్రవరి 27: యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో విడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నెన్నెలలో ఏర్పాటు చేసిన ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని మంగళవారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు నెన్నెల శాఖ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామీణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించేందుకు ఆర్‌బీఐ ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. విడ్స్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ రాజేష్ మాట్లాడుతూ బ్యాంకింగ్ సేవలు, పొదుపు, రుణ వ్యవహారాల్లో క్రమశిక్షణ, జీవన్‌జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన తదితర తక్కువ ప్రీమియంతో అందుబాటులో ఉన్న బీమా పథకాల గూర్చి వివరిస్తామన్నారు. ప్రతీ ఒక్కరికి బ్యాంకు ఖాతా ఉండేలా చూడాలన్నారు. డిజిటల్ లావాదేవీలు, సైబర్ మోసాలపై గ్రామీణ ప్రజలను చైతన్య పరుస్తామని చెప్పారు. పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేష్, టీజీబీ ఫీల్డ్ ఆఫీసర్ సుధీర్, నాయకులు రాంచందర్, ప్రతాప్‌రెడ్డి, సాగర్‌గౌడ్, ఇందూరి రమేష్, తోట శ్రీనివాస్, కౌన్సిలర్ గురునాథం శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవి ఇవ్వాలి

నెన్నెల, ఫిబ్రవరి 27: బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియమించాలని మన్నెగూడం గ్రామానికి చెందిన గోలేటి సంధ్య కోరారు. మంగళవారం ఎమ్మెల్యే వినోద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రైతు కుటుంబంలో పుట్టిన తనకు పదవి ఇస్తే రైతాంగం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

నేర పరిశోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

ఏసీసీ, ఫిబ్రవరి 27 : నేర పరిశోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్‌లో డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఎస్‌హెచ్‌వో లతో సమావేశం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంతో కేసులను ఛేదించి నేరస్తు లకు శిక్షపడేలా చేయాలన్నారు. నేర నిరూపణకు సాక్ష్యాధారాలను పకడ్బందీగా సేకరించాలని సూచిం చారు. ప్రతి కేసు విచారణపై పై అధికారుల పర్యవే క్షణ ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, మహిళలపై నేరాలు, ఫోక్సో, పెండింగ్ కేసులను, మహిళ,మానవ హక్కుల కమిషన్ అప్పీలు కేసుల పెండింగ్‌ల వివరాలను తెలుసుకున్నారు. విచారణలో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలని ఆదే శించారు. ఎన్నికల సమయంలో నమోదైన కేసుల విచారణ పూర్తి చేయాలని ఆదేశించారు. రౌడీషీట ర్లను బైండోవర్ చేయాలని, సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, వ్యక్తిగత దూషణలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్, మంచిర్యాల, జైపూర్, బెల్లంపల్లి ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర్లు, రవికుమార్, సీసీ ఎస్ ఏసీపీ బోజరాజు, సీఐలు, ఆర్ఐలు, ఎస్‌హెచ్ వోలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పోలీసు వాహనాలు తనిఖీ చేసిన సీపీ

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసు వాహనాల పనితీరు నిర్వహణను సీపీ శ్రీనివాస్ కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్‌లో తనిఖీ చేశారు. సీపీ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో వాహనాలు ఎలాంటి ఆటంకం కలగకుండా సాఫీగా సేవలు కొనసాగిస్తున్నాయన్నారు. వాహనాల నిర్వహణ లోటు పాట్లపై నిరంతరం పర్యవేక్షిస్తుండాలని, వాహనాలను తనిఖీలు చేసి సమగ్ర నివేదికను నెలవారీగా సమర్పించాలని మోటారు ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్లకు సూచించారు. వాహనాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు,ఆర్ఐదామోదర్ , బెల్లంపల్లి ఎంటీవో శ్రీనివాస్,రామగుండం ఎంటీవో మధు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ రెఫరీగా రాజలింగు



ఏసీసీ, ఫిబ్రవరి 27 : జాతీయ స్థాయి ఆలిండియా పోలీస్ మీట్ హ్యాండ్ బాల్ పోటీల న్యాయ నిర్ణేతగా జైపూర్ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పీఈటీగా పని చేస్తున్న దుర్గం రాజలింగు ఎంపికయ్యాడు. ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేష్, కోశాధికారి రమేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్‌లు రాజలింగును మంగళవారం అభినందిచారు. ఈ నెల 27 నుంచి 30 వరకు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరగనున్న ఈ పోటీలకు రెఫరీగా వ్యవహరించనున్నట్లు వారు తెలిపారు.

2వ తేదీలోగా ప్రవేశాలకు ఆహ్వానం

దండేపల్లి, ఫిబ్రవరి 27: లింగాపూర్‌లో ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో, 7 నుంచి 10వ తరగతిలో మిగిలిన సీట్లలో చేరేందుకు మార్చి 2లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆదర్శ పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దుర్గం మహేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నియామకం

నెన్నెల, ఫిబ్రవరి 27: బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా కూనారపు యాదగిరి నియమితులయ్యారు. మంగళవారం నెన్నెలలో యాదగిరికి పార్టీ మండల అధ్యక్షుడు శైలెందర్‌సింగ్ నియామక పత్రం అందజేశారు. గ్రామ కమిటీల సమన్వయంతో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. నాయకులు అంగలి శేఖర్, గడ్డం శ్రీనివాస్‌గౌడ్, అద్దరపల్లి సతీష్, కోట వంశీ తదితరులు ఉన్నారు.

ఆజాద్ వర్ధంతి

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 27 : స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిని రిటైర్డు ఆర్మీ జవాన్ రాజేష్ ప్రిహ్వాల్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాణి ప్రిహ్వాల్ తదితరులు పాల్గొన్నారు.

తూనికలు, కొలతల అధికారుల అవగాహన

నస్పూర్, ఫిబ్రవరి 27 : నస్పూర్ మున్సిపాలిటీలోని సుందరయ్య కాలనీ వారసంతంలో మంగళవారం జిల్లా లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తూకం, అధిక ధరలపై వ్యాపారులకు సూచనలు, సలహాలను ఇచ్చారు. అనంతరం సమీపంలోని ఓ షాపులో ఎంఆర్‌పీ కంటె ఎక్కువ ధరకు కూల్‌డ్రింక్స్ అమ్ముతున్న షాపు యజమానికి రూ. 2వేల రూపాయల జరిమానా వేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి కే. విశ్వేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శికి సన్మానం

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 27: కాంగ్రెస్ పార్టీ అనుబంధ యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన మహంత్ అర్జున్‌కుమార్‌ను మంగళవారం కాంగ్రెస్, దాని అనుబంధ సంఘాల నాయకులు సన్మానించారు. అర్జున్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజలకు చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా అందరు పని చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రవే శపెట్టిన ఆరు గ్యారంటీలలో నాలుగు గ్యారంటీలను అమలు చేసినందున వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు.

విజయోస్తు..

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు
- ఉదయం 8.45 గంటల్లోపు సెంటర్‌కు చేరుకోవాలి
- జిల్లా వ్యాప్తంగా 19 పరీక్ష కేంద్రాలు


హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 27: జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇంటర్మీడియట్ పరీక్షలకు నిమిషం ఆలస్యంగా వచ్చినా.. విద్యార్థులను లోపలికి అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు. బుధవారం నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభమవనున్నాయి. ఈ పరీక్షలు మార్చి 19 వరకు కొనసాగుతాయి. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. ఉదయం 8 గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. 8.45 నుం చి 9 గంటల వరకు విద్యార్థులు తమ బయోడేటాలోని ఓఎంఆర్ వివరాలను పరిశీలించుకోవాల్సి ఉంటుంది. 9 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్ష హాల్‌లోకి అనుమతించరు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. రోజూ ఉన్నతాధికారులు పరీక్ష కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారు.

హాజరు కానున్న 10,423 మంది..

జిల్లాలో 10,423 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా 19 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 11 ప్రభుత్వ కళాశాలలు, రెండు ప్రైవేటు కళాశాలలు, రెండు ఆదర్శ పాఠశాలలు, రెండు గిరిజన సంక్షేమ కళాశాలలు, ఎంజేపీ, సాంఘిక సంక్షేమ కళాశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారిని నియమించారు. ఇప్పటికే జిల్లాలో ఫిబ్రవరి 1 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు పూర్తి చేశారు. కాగా పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగ కుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కడ కూడా మాస్ కాపీయింగ్ జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీని కోసం ప్రత్యేకంగా ముగ్గురు సభ్యులతో కూడిన ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంతో పాటు ఇద్దరు సభ్యులతో కూడిన రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా 19 కేంద్రాలలో ఎప్పటి కప్పుడు మానిటరింగ్ చేస్తూ పూర్తి స్థాయిలో మాస్ కాపీయింగ్ నిరోధించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఇంటర్ బోర్డు సూచనల మేరకు పరీక్ష ప్రారంభమైన తర్వాత అనగా ఉదయం 9 గంటల తర్వాత విద్యార్థులను అనుమతిని నిరాకరించారు. పరీక్ష కేంద్రాలకు ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు విద్యార్థులు తీసుకు రావద్దని స్పష్టం చేశారు.

పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు..

నైతం శంకర్, డీఐఈవో



జిల్లాలో బుధవారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలకు పక డ్బందీ ఏర్పాట్లు చేశాం. ఆయా కేంద్రాలలో మౌలిక వసతులను కల్పించాం. విద్యార్థులు పరీక్ష సమయం కంటే అరగంట ముందే కేంద్రానికి చేరుకోవాలి. విద్యార్థులు భయందోళనకు గురికావొద్దు. ప్రశాంత వాతా వరణంలో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలి.



సీసీ రోడ్డు పనులు ప్రారంభం

వాంకిడి, ఫిబ్రవరి 27: వాంకిడి మండల కేంద్రంలోని లక్ష్మీనగర్‌లో మంగళవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ విమలాబాయి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా లక్ష్మీనగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని చెప్పారు. రోడ్డు నిర్మాణం పనులను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ పెంటు, నాయకుడు దీపక్ తదితరులు పాల్గొన్నారు.

'కల్యాణలక్ష్మి' చెక్కుల పంపిణీ

కెరమెరి, ఫిబ్రవరి 27: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ మోతీరాం 14 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ద్రుపతాబాయి, వైస్ ఎంపీపీ కలాం, తహసీల్దార్ దత్తు ప్రసాద్‌రావు, డీటీ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జోడేఘాట్‌ను సందర్శించిన తహసీల్దార్

కెరమెరి, ఫిబ్రవరి 27: మండలంలోని భీం పోరుగడ్డ అయిన జోడేఘాట్‌ను తహసీల్దార్ దత్తు ప్రసాద్‌రావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా భీం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల పోస్టర్ల ఆవిష్కరణ

తిర్యాణి, ఫిబ్రవరి 27: బెల్లంపల్లి పట్టణంలో స్మై. జిమ్ ఆధ్వర్యంలో మార్చి 3వ తేదీన నిర్వహించే బాడీ బిల్డింగ్ పోటీలకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. పోటీలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఈటీ లక్ష్మణ్, జడ్పీటీసీ చంద్రశేఖర్, నాయకులు అనీల్‌గౌడ్, పీఏసీఎస్ ఛైర్మన్ శ్రీనివాస్, భీమయ్య, పీటీ శ్రీనివాస్, ధర్ము తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పొదుపు పాటించాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 27: ప్రతి ఒక్కరూ పొదుపు పాటించడంతో పాటు బ్యాంకు ఖాతా కలిగి ఆర్థిక లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ నుంచి అధికారులు, విద్యార్థులతో చేపట్టిన ర్యాలీని లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ హనుమంతావుతో కలిసి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టరేట్ భవన సముదాయం నుంచి కుమరం భీం చౌక్ మీదుగా తిరిగి కలెక్టరేట్‌కు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో ఆర్థిక అభివృద్ధికి పాటించాల్సిన నియమాలను ప్రజలందరికి అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రతీ ఒక్కరు పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. బ్యాంకు ఖాతా నిర్వహణ ఆర్థిక లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును కౌటాల మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన ఆడె మంజులకు అందజేశారు. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మార్చి 2వ తేదీ వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగాఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, టీజీబీ మేనేజర్ అజేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

● విద్యార్థులను సన్నద్ధం చేయాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 27: ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం జాతీయ బాలల హక్కుల రక్షణ కమిషన్ ఆధ్వర్యంలో పరీక్షపై ఏర్పాటు చేసిన చర్చ, శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని యజమాన్యాల పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషన్ రాష్ట్ర బాధ్యులు దేవయ్యతో కలిసి ఆచప కుమరం భీం చిత్రపటానికి పూల మాలలు వేసి జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు జరుగుతున్నందున ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు విద్యార్థులు ఎలాంటి ఒత్తిడిలకు లోను కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చూడాలన్నారు. విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన విద్యను బోధించాలని, వారికి నచ్చిన ఆటలు ఆడుకునే విధంగా స్వేచ్ఛ వాతావరణం కల్పించాలన్నారు. విద్యార్థుల పట్ల కోపాన్ని ప్రదర్శించకుండా వారిని పరీక్షలకు ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, డీఐఈవో శంకర్ తదితరులు పాల్గొన్నారు.

● పార్లమెంట్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 27: రానున్న పార్లమెంట్ ఎన్నికల కోసం జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆర్డీవో లోకేష్‌రావుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం -2024 లోక్ సభ ఎన్నికల ఏర్పాట్లపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల కోసం జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి విడత పరిశీలన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తి చేశామని తెలిపారు. ర్యాండం ప్రకారం వీవీ ప్యాట్లలో మాక్ పోలింగ్ నిర్వహించామన్నారు. ఓటరు జాబితాపై ఏదైనా అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకు రావాలని చెప్పారు. ఎలాంటి పొరపాట్లు లేని సమర్థవంతమైన ఎన్నికల నిర్వహణకు సెక్టార్ అధికారులను నియమించి శిక్షణ ఇచ్చామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఓటరు గుర్తింపు కార్డులను సిద్ధం చేసి తపాల శాఖ ద్వారా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పార్లమెంట్ ఎన్నికలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించే విధంగా రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.

రైస్ మిల్లుల్లో బియ్యం మాయం

- ఎన్‌ఫోర్సుమెంటు అధికారుల దాడుల్లో బట్టబయలు


వివరాలు వెల్లడిస్తున్న ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి(ఫైల్)

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 27: జిల్లాలోని రైస్ మిల్లుల్లో భారీగా అవినీతి అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. వానాకాలం, యాసంగి సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైస్ మిల్లర్లకు అప్పజెప్పుతోంది. ఈ ధాన్యాన్ని రైస్ మిల్లర్లు సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్)గా మార్చి ఎఫ్‌సీఐకి అప్పగించాలి. అక్కడి నుంచి ఎంఎల్ఎస్ పాయింట్‌కు చేరుకొని రేషన్ దుకాణాల ద్వారా ఆ బియ్యాన్ని పేదకు పంపిణీ చేస్తారు. కాగా జిల్లాలో రైస్ మిల్లర్లు, సివిల్ సంప్లయ్ అధికారులుతో చేతులు కలిపి ఈ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. గడువులోగా మిల్లర్లు ఎఫ్‌సీఐకి పంపించాల్సిన బియ్యాన్ని యథేచ్ఛగా వాడుకొని వ్యాపారం చేస్తూ రైస్ మిల్లర్లు కోట్లు గడిస్తున్నారు. ఇదంతా సివిల్ సంప్లయ్ అధికారుల అండదండలతోనే జరుగుతున్నాయన్న ఆరోణలున్నాయి. ఫిర్యాదులు వస్తే తప్పా అధికారులు హడావుడిగా తనిఖీలు చేసి బియ్యం పక్కాదారి పట్టాయని మిల్లర్లపై కేవలం 6ఎ కేసులు నమోదు చేసి చేతులు దులుపుంటున్నారు. లెక్క తేలని బియ్యం రికవరి విషయంలో ఊసేత్తెటం లేదు. దీంతో అధికారులు, రైస్ మిల్లర్ల నిర్వహకంతో ప్రభుత్వానికి కోట్ల మేర నష్టం వాటిల్లితోంది.

రూ.8 కోట్ల విలువ..

ఇటీవల జిల్లాలోని సిర్పూరు(టి)లో గల రెండు రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్సు మెంటు అధికారులు దాడులు చేసి రూ.8 కోట్ల విలువైన బియ్యం మాయం అయినట్టు వెల్లడించారు. ఈ నెల 21న సిర్పూరు(టి) మండలంలోని వేంపల్లి రైస్ మిల్లులో అధికారులు తనిఖీలు నిర్వహించి రూ.2.88 కోట్ల ధాన్యం లేదని నిర్ధారించి సదరు యాజమానిపై 6ఎ కేసు నమోదు చేశారు. అలాగే సోమవారం వెంకట్రావుపేట గ్రామంలోని శ్రీ సాయి బాలాజీ రైస్ మిల్లులో కరీంనగర్ ఎన్‌ఫోర్సుమెంటు అధికారులు దాడులు నిర్వహించి రూ.5.90 కోట్ల విలువ చేసే 69వేల బస్తాల సీఎంఆర్ ధాన్యం లేవని నిర్ధారించారు. ఈ రెండు దాడుల్లో సుమారు రూ.8 కోట్ల విలువ చేసే బియ్యం పక్కాదారి పట్టినట్టు అధికారులు గుర్తించారు. రైస్ మిల్లర్లు ధాన్యాన్ని ప్రభుత్వానికి నిర్ధారించిన సమయంలో అందించక వాటిని బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తూ ప్రభుత్వానికి మొండి చేయి చూపుతున్నారు. అధికారులు, రైస్ మిల్లర్లు కనుసన్నల్లోనే ఈ తతంగం జరుగుతోందని బహిరంగ ప్రచారం జరుగుతోంది. భారీ మొత్తంలో బియ్యం నిల్వలు మాయం అవుతున్న అధికారులు కేవలం మిల్లర్లు ఇచ్చే ముడుపులను తీసుకొని కేవలం 6ఎ కేసుల నమోదుతోనే సరి పెడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పారదర్శకంగా ఆఫీస్ అటెండెంట్ నియామకాలు


ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 27: సింగరేణి మందమర్రి ఏరియాలో ఆఫీస్ అటెండెంట్ పోస్టులకు సంబంధించి పారదర్శకంగా నియమించామని ఎస్వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. స్థానిక జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఆఫీస్ అటెండెంట్ టీఎస్ గ్రేడ్ హెచ్ ఉద్యోగాలకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. అదే విధంగా రికార్డు అసిస్టెంట్ టీఅండ్ ఎస్ గ్రేడ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు చేపట్టారు. ఆఫీసు అటెండెంట్ రెండు పోస్టులకు గాను 33 మంది దరఖాస్తు చేసుకున్నారు. దీనిలో ముగ్గురు గైర్హాజరయ్యారు. రికార్డు అసిస్టెంట్‌కు నలుగురు దరఖాస్తు చేసుకొని నలుగురు హాజరయ్యారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఐఈడీ రాజన్న, తదితరులు పాల్గొన్నారు.



అండర్‌గ్రౌండ్ అలవెన్స్ రద్దు నిర్ణయం విరమించుకోవాలి

కాసిపేట, ఫిబ్రవరి 27: సింగరేణిలో కార్మికులకు అందజేసే అండర్‌గ్రౌండ్ అలవెన్స్ రద్దు చేయడాన్ని విరమించుకోవాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గత కొంత కాలంగా మందమర్రి ఏరియాలోని 400 మంది అండర్‌గ్రౌండ్‌కార్మికులను అవసరాల రీత్యా సర్ఫేస్ పనులు చేయించిందని తెలిపారు. సర్ఫేస్‌లో పనిచేస్తున్న కార్మికులకు అండర్‌గ్రౌండ్ అలవెన్స్‌లను కట్ చేస్తామని చెప్పడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. సింగరేణి అవసరాల కోసం కార్మికులను వాడుకుని అండర్‌గ్రౌండ్ అలవెన్స్‌లను కట్ చేయడం సరైంది కాదని, ఈ విధానాన్ని వెంటనే విరమించుకోవాలని కోరారు.

ఒత్తిడిని అధిగమిస్తేనే విజయం

- ఎస్పీ సురేష్‌కుమార్


విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న ఎస్పీ సురేష్‌కుమార్

సిర్పూర్(టి), ఫిబ్రవరి 27: పదో తరగతి విద్యార్థులు ఒత్తిడిని అధిగమిస్తే విజయం సాధ్యమని జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం సిర్పూర్(టి) మండలంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎస్పీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కృషి తపన పట్టుదల సమయ పాలన విజయానికి ముఖ్య సూత్రాలు అవుతాయని అన్నారు. ఎక్కడో మారు మూల గ్రామంలో పుట్టిన తాను కనీసం బస్ సౌకర్యం కూడా లేని ఊరి నుంచి మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లి చదివానని అన్నారు. ఆపట్టుదలతో ఇప్పుడు మన జిల్లాకు ఎస్పీగా చేస్తున్నానని అన్నారు. దీనంతికి చదువే ప్రధాన కారణమని వివరించారు. చదువు జ్ఞానాన్ని పెంచుతుందన్నారు. ప్రతీ ఒక్కరు గొప్ప లక్ష్య సాధనకై ఆలోచన చేయాలన్నారు. లక్ష్యం సాధించడానికి ఒత్తిడిని అధిగమించి ముందుకు వెళ్లాలని సూచించారు. తన మీద తనకు నమ్మకం ఏర్పడ్డప్పుడే అనుకున్నది సాధించగలుగుతారని అన్నారు. ప్రశాంత చిత్తం పీక్షల్లో విజయానికి నాంది పలుకుతుందని అన్నారు. ఎటువంటి భయం ఒత్తిడి లేకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ఆట పాటలతో అలరించారు. సుమారు 575 మందికి పరీక్ష సామగ్రి అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ కరుణాకర్, సీఐ సాదిక్ పాషా, ఎస్సై దీకొండ రమేష్, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై స్పందించాలి

కౌటాల, ఫిబ్రవరి 27: ప్రజలు చేసే ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించాలని జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని అన్నారు. మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుం డా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుపై గ్రామస్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఆర్థిక సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అనంతరం రిసెప్షన్, లాకప్, మెన్‌బ్యారక్, టెక్నికల్‌రూంలను పరిశీలించారు. ఆయన వెంట డీఎస్పీ కరుణాకర్, సీఐ సాదిక్ పాషా, ఎస్సై మధుకర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

జైనూర్, ఫిబ్రవరి 27: విద్యార్థులు ఒత్తిడి లేకుండా పదో తరగతి పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఏటీడీవో పురుషోత్తం అన్నారు. మండలంలోని రాసిమెట్ట బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏటీడీవో మాట్లాడారు. గత సంవత్సరం ఈ పాఠశాల విద్యార్థినులు జిల్లా స్థాయిలో ర్యాంకులు సాధించారని చెప్పారు. వావరికి ఆదర్శంగా తీసుకొని ఈ ఏడాది సైతం రాసిమట్ట పాఠశాలలో మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలని సూచించారు. అంతకు ముందు విద్యార్థినులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన ఎంపీపీ


మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీపీ

కౌటాల, ఫిబ్రవరి 27: హైదరాబాద్‌లో రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, శిశు సం క్షేమ శాఖ మంత్రి సీతక్కను మంగళవారం ఎంపీపీ విశ్వనాథ్ మర్యాపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కౌటాల, ఫిబ్రవరి 27: మండల కేంద్రంలోని ఇన్‌ఫ్రెంట్ జీసెస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల వార్షికోత్సవంను సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా మేత్రాసనం బిషప్ ప్రిన్స్ ఆంటోని, ప్రిన్సిపాల్ టోం థోమస్ మాట్లాడారు. విద్యార్థుల లక్ష్యం కోసం క్రమశిక్షణతో చదవాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే తాము జీవితంలో స్థిరపడే రంగాన్ని ఎంచుకొని కష్టపడాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మామూళ్ల కోసమే వేధింపులు

- రైస్ మిల్లు యజమానులు

సిర్పూర్(టి); ఫిబ్రవరి 27: సిర్పూర్(టి) మండల కేంద్రంలోని శ్రీసాయిబాలాజీ రైస్ మిల్లుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రాజ్‌కు మార్, శ్రీనివాస్ తాము మామూళ్లు ఇవ్వనందుకే వేధించేందుకు తనిఖీ చేపడుతున్నారని యజమానులు మనీష్, శివకుమార్ అన్నారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నియోజక వర్గంలోని తమ ఒక్క రైస్ మిల్లుపైనే ఈ నెల 21 నుంచి 25 వరకు కక్ష సాధింపు చేపట్టారని, తాము ఎలాంటి అవినీతికి పాల్పడలేదని చెప్పారు. వారు అడిగినంత మేరకు మామూళ్లు ఇవ్వక పోవడంతోనే కక్షతో వేధిస్తున్నారని అన్నారు. తమ వద్ద 16 వేల బస్తాలు ఉన్నాయన్నారు. తమ అనుమతి లేకుండానే రైస్ మిల్లుకు వచ్చి సీజ్ చేశారని, తాళాలు పగులగొట్టారని తెలిపారు. కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు.

నర్సరీ పనుల పరిశీలన

వాంకిడి, ఫిబరవరి 27: వాంకిడి మండలంలోని ఇందాని గ్రామంలో మంగళవారం నర్సరీ ఉపాధిహామీ పనులను ఎంపీడీవో వీవీ వరలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆమె వెంట ఏపీవో శ్రావణ్, కార్యదర్శి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సిర్పూర్(టి): చీలపల్లి గ్రామంలో నర్సరీని ప్రత్యేకాధికారి మధులత పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలో ఈజీఎస్‌లో కూలీలను ఏర్పాటు చేసి మొక్కలకు నీరందించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఈజీఎస్ పనులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట కార్యదర్శి తదితరులు ఉన్నారు.

ఘనంగా 24 కుండీల యజ్ఞం

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 27: కాగజ్‌నగర్ గాయత్రి పీఠంలో మంగళవారం 24 కుండీల యజ్ఞం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హరిద్వార్ పీఠం నుంచి గురువు రాంనాథ్ ఠాగూర్, హైదరాబాద్ గాయత్రి పీఠం సభ్యులు రాజబాబు, శ్రీలత ఆధ్వర్యంలో యజ్ఞాన్ని నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమాన్ని పంపిణీ చేశారు. కార్యక్ర మంలో స్థానిక గాయత్రి పీఠ సభ్యులు చిట్యాల రవి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.